క్లుప్తంగా

ఘనంగా వారాల పండుగ

మక్కువ: మండలంలోని కొన గ్రామంలో వారాల పండుగ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. భక్తులు కోళ్లు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవత కోన పోలమ్మను సోమవారం గ్రామంలోకి తీసుకువస్తారు. బుధవారం నుంచి గ్రామంలోని అన్ని పురవీధులలో తిరువీధి నిర్వహిస్తారు. గ్రామంలో నెల రోజుల పాటు అమ్మవారు కొలువై ఉంటుందని గ్రామపెద్దలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు కలుగజేసే దోమల నివారణ కోసం ఏసీఎం 5శాతం మందును పిచికారీ చేయాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతకొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తిచెందుతున్నాయన్నారు. సాయంత్రం, రాత్రివేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సివస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి దోమల నివారణ మందును పిచికారీ చేయాలని కోరారు.

థాంక్యూ సీఎం సార్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, మహిళలు

వీరఘట్టం: 'వైఎస్సార్ ఆసరా'తో మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలమని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. 'వైఎస్సార్ ఆసరా'తో లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన సందర్భంగా ఆదివారం చిదిమి గ్రామంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం సార్ థాంక్యూ అంటూ మహిళలు నినాదాలు చేశారు.

గాయత్రీ మహాయజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం గ్రామంలో నవకుండలి గాయత్రీ మహాయజ్ఞంను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పార్వతీపురం స్వామిసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యజ్ఞంలో తొమ్మిది మంది దంపతులు పాల్గొని గాయత్రీమాతకు పూజలు చేశారు. లోక కల్యాణం కోసం గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కంచుమోజు రామ్మోహనరావు తెలిపారు.

ఒత్తిడి జయిస్తే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

వంగర: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, పలు సూచనలు చేశారు. సిలబస్ ప్రకారం చదవాలని, మొదట పరీక్షలంటే భయం వీడాలన్నారు. విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ అని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్ల స్వాధీనం

బొబ్బిలి: అక్రమంగా మద్యంబాటిళ్లు తరలిస్తున్న మండలంలోని హరిజన పాల్తేరుకు చెందిన చింతాడ వెంకయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, 15 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ గుంట్రెడ్డి భాస్కరరావు తెలిపారు. సదరు వ్యక్తిని ఆదివారం కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి 10 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా మానికొమ్మల పండుగ



క్రైస్తవ భక్తుల ర్యాలీ

మక్కువ: మండలంలోని ఆర్‌సీఎం వీధికి చెందిన క్రైస్తవ భక్తులు ఆదివారం మానికొమ్మల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా గుడ్ ఫ్రైడేకు ముందు మానికొమ్మల పండుగ చేసుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులు ఆర్‌సీఎం వీధి నుంచి సుమారు కిలోమీటరున్నర దూరంలో ఉన్న చర్చి వద్దకు మానికొమ్మలు చేతబూని ప్రార్థనలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు.

మహిళలకు అండగా ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే జోగారావు
- వైఎస్‌ఆర్ ఆసరా చెక్కు పంపిణీ



ఆసరా చెక్ పంపిణీ చేస్తున్న ఎంపీ జి మాధవి, ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అర్హతే కొలమానంగా మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జగనన్న ప్రభుత్వం మంజూరుచేసిన వైఎస్‌ఆర్ ఆసరా చెక్‌ను సీతానగరం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఏపార్టీ వారైనా పేదవారై, అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకం వారికి తప్పక అందివ్వాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డియ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. ప్రజాసంకల్ప యాత్రకు వచ్చిన సమయంలో ప్రజలకు ఇచ్చినహామీలను 90 శాతం అమలు చేశారన్నారు. ముఖ్యంగా మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి ముద్ర వేసుకుని దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా చేస్తున్నారని చెప్పారు.

చెక్కుల అందజేత

మూడో విడతగా వైఎస్‌ఆర్ ఆసరాపొందిన మహిళా సంఘాల సంఖ్య 1,141 కాగా లబ్ధిదారులు 13,217 మంది. రూ.6 కోట్ల45 లక్షల,87వేల,308లు చెక్కును, అలాగే వెలుగు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాల కింద రూ 34,11,50,000లు చెక్కును ఎంపీ మాధవి, ఎమ్మెల్యే జోగారావు అందజేశారు.

పురుషులతో సమానంగా హక్కులు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అరకు ఎంపీ గొట్టేటి మాధవి మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో 50 శాతం హక్కులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కల్పించిందని తెలియజేశారు. మహిళలకు అండగా ఉన్న జగనన్నకు అండగా ఉంటామని చప్పట్లు, హర్షధ్వానాలతో తెలియజేయాలని మహిళలను ఎంపీ మాధవి కోరగా మహిళలంతా ముక్తకంఠంతో జై జగనన్న అంటూ నినాదాలు చేశారు.

ముఖ్యమంత్రికి క్షీరాభిషేకం

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంపీ జి మాధవి, ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులందరం రుణపడి ఉంటామని చెబుతూ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, స్థానిక ఎంపీటీసీలు ఎస్ గౌరి, బి.కుసుమతో పాటు పలుగ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వెలుగు సిబ్బంది, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, సీసీలు వీఓఏలు పాల్గొన్నారు.



జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ, మహిళా సంఘాలు

ఆసరాతో ఆర్థిక ఇబ్బందులు దూరం



దీర్ఘకాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సమయంలో దేవుడిలా వచ్చిన జగనన్న ప్రభుత్వంలో మా కుటుంబానికి పొదుపుసంఘం రుణమాఫీ వర్తించింది. రెండు పర్యాయాలు వైఎస్‌ఆర్ ఆసరా ద్వారా రూ.10 వేలువంతున, మూడో విడత కింద ఇప్పుడు రూ.10 వేలు వచ్చింది. నాభర్తకు నెలకు రూ 2,750 పింఛన్ వస్తోంది. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నాను.

జి లక్ష్మి, పొదుపు సభ్యురాలు, చినభోగిలి

కుటుంబానికి అండ



జగనన్న ప్రభుత్వం వైఎస్ ఆర్ ఆసరా పథకం ద్వారా సమకూర్చిన నిధులతో కొనుగోలు చేసిన కుట్టు మిషన్ పెట్టుకుని ఆర్థికంగా లబ్ధి పొంది పిల్లల్ని చదివించగలుగుతున్నాను. కుటుంబానికి అండగా ఉన్న జగనన్నను మళ్లీ గెలిపించుకుంటాం.

యామల స్వాతి, పెదభోగిలి

కుటుంబ పోషణకు ఆసరా సాయం



జగనన్న ప్రభుత్వం వెలుగు ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి అమలు చేసిన వైఎస్ ఆర్ ఆసరా పథకం ద్వారా వచ్చిన ఆర్థిక సాయంతో కిరాణాదుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. షాపులో వచ్చిన ఆదాయంతో బ్యాంక్‌రుణం తీరుస్తూ మిగిలిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇంతటి సహకారం అందించిన జగనన్నకు రుణపడి ఉంటాను. ఓట్ల రూపంలో రుణం తీర్చుకుంటాను.

బి.పార్వతమ్మ, పెదంకలాం

చంద్రబాబు గిరిజన ద్రోహి

- గిరిజనుల గురించి మాట్లాడే హక్కు టీడీపీ నాయకులకు లేదు
- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అమాయకులైన గిరిజనుల గుండెల్లో గునపం దించిన చంద్రబాబునాయుడు గిరిజన ద్రోహని, గిరిజనుల గురించి మాట్లాడే హక్కు టీడీపీ నాయకులకు లేదని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క గిరిజనుడికి మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. అలాగే ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయలేదని.. జీసీసీ, ట్రైకార్ చైర్మన్ల నియామకం చేపట్టలేదని మండిపడ్డారు. బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చకపోవడంతో తాము ఢిల్లీ వెళ్లి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి సమస్యను విన్నవించుకున్నామని గుర్తు చేశారు. కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణితో కలిసి అప్పటి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావుకు వినతిపత్రం అందజేశామని చెప్పారు. ఈ విషయంలో అప్పటి టీడీపీ గిరిజన ఎమ్మెల్యేలు ఏం చేసారని ప్రశ్నించారు. నేడు వారే మొసలికన్నీరు కారుస్తూ గిరిజనుల గురించి మాట్లాడడం శోచనీయమన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన కేంద్ర మాజీమంత్రి కిశోర్ చంద్రదేవ్ అంటే తనకెంతో గౌరవముందని.. అటువంటి వ్యక్తి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఒకలా.. టీడీపీలోకి వెళ్లిన తర్వాత మరోలా మాట్లాడడం సరికాదన్నారు. అప్పట్లో బాక్సైట్ గనుల తవ్వకానికి వ్యతిరేకంగా కిశోర్‌చంద్రదేవ్ మాట్లాడారని గుర్తుచేసారు. దీనికి సంబంధించి 2015లో జారీ చేసిన జీఓ 97ను జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రద్దు చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గిరిజనులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఎస్టీ కమిషన్, గిరిజన కార్పొరేషన్, గిరిజన సలహా మండలి ఏర్పాటు.. నిరుపేదలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. గిరిజనులకు అన్ని విధాలా అన్యాయం చేసిన టీడీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు.

'జగనన్నే మా భవిష్యత్' ప్రచార సామగ్రి పంపిణీ



మిర్తివలసలో కన్వీనర్లకు పంపిణీ చేసిన సామగ్రి

బలిజిపేట: ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమ ప్రచార సామగ్రిని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం వెంగాపురం, మిర్తివలస, పలగర, బలిజిపేట, తుమరా డలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఎ.రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ప్రారంభం కానున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో క్లస్టర్ల వారీగా నిర్దేశించిన ప్రకారం కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొని ఇంటింటికీ తిరిగి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, టి.ప్రసాద్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో పంట నష్టం



చాకరాపల్లిలో నేలకొరిగిన జొన్నపంట

బలిజిపేట: ఈదురుగాలుల ప్రభావానికి మండలంలోని పి.చాకరాపల్లి గ్రామంలో మొక్కజొన్న పంట, వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగాయి. శనివారం సాయంత్రం వీచిన ఈదురుగాలుల ప్రభావంతో సుమారు 50ఎకరాల జొన్నపంట ధ్వంసమైంది. అదేవిధంగా వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా నిమిత్తం ఏర్పాటు చేసిన స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగాయి. గ్రామంలో సుమారు 120ఎకరాలలో మొక్కజొన్న పంట వేయగా ఇటీవల వీచిన ఈదురుగాలుల ప్రభావానికి కొంత నష్టపోయామని, మళ్లీ శనివారం సాయంత్రం వీచిన గాలులతో బాగా పంట నష్టపోయామని రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి పంటనష్టం అంచనా వేయాలని కోరుతున్నారు.



నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఘనంగా మట్టల ఆదివారం



పార్వతీపురం టౌన్: ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవ సోదరులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని పుర వీధుల్లో ఈత రెమ్మలకు పువ్వులు కూర్చి తిరువీధి చేశారు. మట్టల ఆదివారం సందర్భంగా సీతానగరం, పెదబోగిలి మార్కెట్‌లో లచ్చయ్యపేట చర్చి ఫాదర్ పోలిరాజు ఆధ్వర్యంలో క్రైస్తవులంతా ప్రచారం చేశారు.



ప్రచారం చేస్తున్న లూథరన్ చర్చి క్రైస్తవులు

పార్వతీపురంలో..

పార్వతీపురంటౌన్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు చర్చిలలోక్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి ఫాదర్స్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పట్టణంలో క్రైస్తవ సోదరులు ఏసు నామం జపిస్తూ ర్యాలీ చేశారు.

జోరుగా విప్పపూల సేకరణ



గిరిజనులు సేకరించిన విప్పమొగ్గలు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ గ్రామాల ప్రజలు విప్పపువ్వు (మొగ్గలు) సేకరణలో నిమగ్నమై ఉన్నారు. ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో విప్పపూలు పూస్తుంటాయి. వాటిని సేకరించి, ఎండలో ఆరబెడతారు. బాగా ఆరిన తర్వాత వాటిని వ్యాపారులకు అమ్ముతుంటారు. ఏటా ఈ సీజన్‌లో గిరిజనులకు వీటి సేకరణ ద్వారా కొంత ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం కిలో విప్పపువ్వును రూ.15 నుంచి రూ.20లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ విప్పపువ్వును ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పాలకొండ రూరల్: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు అన్నారు. ఆదివారం ఏపీటీఫ్ ఆధ్వర్యంలో పాలకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్–2కు సంబంధించి పాఠ్యాంశాలను విడుదల చేయాలని ఏపీపీఎస్సీని కోరినట్లు చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనకు మద్దతిచ్చిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు ఏపీటీఫ్ నాయకులు సంపత్‌కుమార్, కె పద్మజ, వాసు ఉన్నారు.

అనాథ పిల్లలకు వాత్సల్య పథకం

సీతంపేట: ఏ ఆధారం లేని అనాథ పిల్లల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాత్సల్య పథకాన్ని అలము చేస్తున్నాయని ఐసీడీఎస్ సీడీపీఓ పి.రంగలక్ష్మి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి ఆదరణ లేకుండా బంధువులు, ఇతరుల సంరక్షణలో పెరుగుతున్న బాలబాలికల విద్యాభ్యాసం కోసం ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. 18 సంవత్సరాల లోపు అనాథ బాలలు దీనిలో స్పాన్సర్ షిప్ పొందుటకు అర్హులుగా పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కురుపాం: మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీపీసీఎస్ అధ్యక్షుడు కొదంగోల గౌరీశంకరరావు(మజ్జి) అన్నారు. కురుపాం మండల కేంద్రంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు ఆగూరు రామారావు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పీపీసీఎస్ అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్లను సంఘ సభ్యులు సత్కరించారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాదా ఆశోక్, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం..



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అందరం సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేద్దామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. పట్టణంలో ఫిలడెల్ఫియా కమ్యూనిటి ఆస్పత్రి ఎదురుగా ఉన్న కమ్యూనిటి హాల్‌లో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లతో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు అవినీతి చేయడంతో ప్రజలు విసుగుచెందిన 2019లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. రానున్న కాలంలో కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నను ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తారని ఆకాంక్షించారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా స్పందన తెలుసుకుని 82960 82960 నంబరుకు మిస్డ్‌కాల్ ఇప్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

నగరపంచాయతీ అభివృద్ధికి చర్యలు

పాలకొండ: నగరపంచాయతీలో యుద్ధప్రాతిపధికన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.15 కోట్లతో చేపట్టిన రహదారులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే అత్యవసర రహదారుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, కమిషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కొరికాన గంగునాయుడు, సీలాపు శ్రీనివాసరావు, తూముల లక్ష్మణరావు, పల్లా బాను, కోడెం విజయకుమార్, కిల్లారి మోహన్, దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణకుమార్, కద్రోతు లక్ష్మి, కడగల రమణ, మాజీ కమిషనర్ లిల్లీపుష్పనాథం, కోరాడ రవికుమార్, నగరపంచాయతీ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

ఘనంగా చక్రతీర్థ స్నానం



చక్రతీర్థ స్నానం అనంతరం విగ్రహాలను తరలిస్తున్న భక్తులు

భామిని: మండలంలోని ఘనసర కోదండరామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి చక్రతీర్థ స్నానం ఘనంగా నిర్వహించారు. మందిరం నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి వంశధార నదిలో చక్రతీర్థ స్నానం చేయించారు. అనంతరం భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావ, సర్పంచ్ కిల్లారి కమల దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.